తీరం.. బతుకు దుర్భరం


ఉప్పుటేరు ఒడ్డుకు చేర్చిన పడవలు

- వరుస తుఫాన్లు, అల్ప పీడనాలతో చేపల వేట బంద్
- చిరు చేపలూ దొరకని వైనం
- ప్రభుత్వ సాయం కోసం మత్స్యకారుల ఎదురుచూపులు

పరవాడ: వరుస తుఫాన్లతో చేపల వేట సాగక ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం, జాలరి పేట, తిక్కవానిపాలెం గ్రామాలకు చెందిన మత్స్యకారులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. తుఫాన్ వచ్చిందంటే మత్స్యకార్మికులు భయపడిపోతున్నారు. నాలుగు రోజులుగా తుపాను కారణంగా స్థానిక మత్స్యకారులు చేపల వేట మానుకొని ఇళ్లకే పరిమితమయ్యారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాదిలో అధిక తుఫాన్లు ఏర్పడటంతో తీవ్ర నష్టాలను చవిచూడాల్సి వచ్చిందని గంగపుత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలలో 15 రోజులు చేపల వేట సాగిస్తే తుఫాన్లు, అల్పపీడనాల కారణంగా 15 రోజులు ఇళ్లకే పరిమితమవుతున్నామని, ఫలితంగా కుటుంబ పోషణ కష్టమవుతోందని వాపోతున్నారు. అడపా దడపా చేపల వేటకు వెళ్లిన వలలకు కాస్తో కూస్తో చేపలు చిక్కితే వేట సాగించిన వారందరు పంపకాలు చేసుకొని వాటిని అమ్మగా వచ్చిన అతి తక్కువ సొమ్ముతో ఇల్లు గడవడం కష్టమవుతుందంటున్నారు.

మత్స్య సంపద.. మృత్యువాత

ఫార్మా వ్యర్థ జలాలను యథేచ్ఛగా సముద్రంలో విడిచిపెట్టడం వల్ల చిన్న పెద్ద చేపలతోపాటు పీతలు, రొయ్యలు మృత్యువాత పడటం వల్ల వేటకు వెళ్లిన వలలకు చేపలు చిక్కడం లేదని స్థానిక మత్స్యకారులు చెబుతున్నారు. అప్పుడప్పుడు వలలకు చిక్కుతున్న చేపలు విక్రయించగా వచ్చిన సొమ్ము పడవల ఆయిల్ ఖర్చులకే సరిపోవడం లేదంటున్నారు. ఒక్కో రోజు వేటలో వలలకు చేపలు చిక్కకపోవడంతో వట్టి చేతులతో తిరుగుముఖం పట్టడం తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


తీరాన్ని తాకుతున్న సముద్రపు కెరటాలు


తుఫాన్ తీవ్రతను గమనిస్తున్న గంగపుత్రులు

కష్టంగా కుటుంబ పోషణ

తుఫాన్లు సంభవించినపుడు సముద్రం అల్లకల్లోలంగా మారుతున్న సమయంలో పడవలు, ఇంజిన్లు, వలలను సురక్షిత ప్రదేశాల్లో భద్రపర్చుకుని చేపల వేట మానుకోవడం వల్ల కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారుతోందని గంగపుత్రులు వాపోతున్నారు. వాతావరణం బాగుంటే చేపల వేట ద్వారా వచ్చే ఎంతో కొంత ఆదాయంతో కుటుంబాలను నెట్టుకొచ్చే వారమని, తుపాను సంభవిస్తే వేటకు వెళ్లని మత్స్యకార కుటుంబాలను గుర్తించి గత ప్రభుత్వం ఉచితంగా బియ్యం, పప్పులు, ఉప్పులు సరఫరా చేసేదని గుర్తు చేసుకుంటున్నారు. ప్రస్తుతం అటువంటి పద్ధతులకు నేటి ప్రభుత్వాలు తిలోదకాలిస్తూ మత్స్యకార్మికుల వైపు కన్నెత్తి చూసే నాథుడు కరువయ్యారని వాపోతున్నారు.

అందని 'మత్స్యకార భరోసా'

తుఫాన్ కారణంగా రోజుల తరబడి చేపల వేట సాగకపోవడంతో పరిశ్రమలు, భవన నిర్మాణ పనులకు వెళ్లి కుటుంబాలను నెట్టుకు వస్తున్నామని ఆయా ప్రాంతాల మత్స్యకారులు చెబుతున్నారు. గత జూలైలో అందాల్సిన మత్స్యకార భరోసా నెలలు గడుస్తున్నా.. నేటి వరకు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుఫాన్ సమయంలో మత్స్యకార భరోసా తమ కుటుంబాలకు అండగా ఉంటుందని ఆశించినా.. ఎలాంటి ఫలితం కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రభుత్వ సాయం కోసం గంగపుత్రులు ఎదురు చూస్తున్నారు.


సురక్షిత ప్రదేశానికి వలను తరలిస్తున్న మత్స్యకారులు

పూట గడవడం కష్టం



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చేపల వేట సాగడం లేదు. మరో నాలుగు రోజుల పాటు ఇలానే ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తుండటంతో ఆందోళన చెందుతున్నాం. చేపల వేట సాగకపోతే పూట గడవడం చాలా కష్టం. కుటుంబాన్ని ఏ విధంగా నెట్టుకు రావాలో తెలియట్లేదు. వారం రోజులుగా వేట సాగక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాం.

– బొంది అమ్మోరు, ముత్యాలమ్మపాలెం

చిరు చేపల ఆసరా పోయే..



తుపాను, భారీ వర్షాల సమయాల్లో ఉప్పుటేరులో చిరుచేపల వేటతో ఇంటి ఖర్చులు గడిచిపోయేవి. ఉప్పుటేరులో కూడా ఫార్మా వ్యర్థ రసాయనాలు కలవడంతో బొంతలు, రొయ్యలు వంటి చిరు చేపలు చనిపోతున్నాయి. ఇంటి ఖర్చులకు ఉపయోగపడే వీటి ఆసరా కూడా లేకుండా పోయింది. చిరు చేపల వేట సాగక ఇంట్లో దినసరి ఖర్చుల కోసం అప్పులు చేయాల్సి వస్తోంది.

– సూరాడ కృష్ణ, మత్స్యకారుడు

ప్రభుత్వ భరోసా లేదు



గతంలో నాలుగైదు రోజులు చేపల వేటకు వెళ్లకపోతే ప్రభుత్వం బియ్యం, పప్పులు, ఉప్పులు అందించేది. ప్రస్తుత ప్రభుత్వం మత్స్యకారుల వైపు చూడటం లేదు. వారం పది రోజుల పాటు చేపల వేట సాగకపోతే మా కుటుంబాలు పస్తులతో కాలం గడపక తప్పదు. ఈ ఏడాది మత్స్యకార భరోసా కూడా అందలేదు. కూటమి ప్రభుత్వం కాలయాపన చేయడంలో ఆంతర్యం ఏంటో అంతుచిక్కట్లేదు.

– మేరుగ నూకరాజు, మత్స్యకారుడు

క్లుప్తంగా

వినియోగదారులకు సక్రమంగా సరకులు


ఎలక్ట్రానిక్ కాటాను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ ఉమాదేవి తదితరులు

పెందుర్తి: రైతుబజార్‌లో నిబంధనల ప్రకారం కాటాలను వాడి వినియోగదారులకు సక్రమంగా కూరగాయలు, సరకులు అందించాలని తూనికలు, కొలతలు ఇన్‌స్పెక్టర్ ఉమాదేవి సూచించారు. స్థానిక రైతుబజార్‌ను ఆదివారం ఆమె సందర్శించారు. స్టాళ్లలో రైతుల వద్ద ఉన్న ఎలక్ట్రానిక్ కాటాలను పరిశీలించారు. సీళ్లు లేని కాటాలను గుర్తించి ఈ నెలాఖరు లోగా సీళ్లు వేయించాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం కాటాలు లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కూరగాయల స్టాళ్లతో పాటు సూపర్‌బజార్, గృహమిత్ర, స్పెషల్ రైస్ కౌంటర్లలో తూకాలను సరిచూశారు. రైతుబజార్ ఈవో వి.ఎస్.పి.శర్మిల, సహాయకుడు చిన్నా పాల్గొన్నారు.

త్వరితగతిన అభివృద్ధి పనులు


జెర్రిపోతులపాలెంలో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి: పంచాయతీల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సూచించారు. మండలంలోని జెర్రిపోతులపాలెంలో ఉపాధి హామీ నిధులు రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు పూర్తిస్థాయి మౌళిక వసతుల కల్పన కోసం పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మధుపాడ నాగమణి, సర్పంచ్ మడక అప్పలరాజు, ఎంపీడీవో వెంకటరావు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కృష్ణప్రసాద్‌కు ఉత్తమ బోధన అవార్డు



కృష్ణప్రసాద్‌కు అవార్డు అందజేస్తున్న డాక్టర్ మిను బాజ్‌పాయ్

సింహాచలం: శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ప్రొఫెసర్ డాక్టర్ పి.కృష్ణప్రసాద్‌కి ఉత్తమ బోధన అధ్యాపకుడు అవార్డు లభించింది. అసోసియేషన్ ఆఫ్ నేషనల్ బోర్డు అక్రిడిటెడ్ ఇన్‌స్టిట్యూట్ మెడికల్ టీచర్స్ డే నగరంలో శనివారం రాత్రి నిర్వహించారు. నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ మిను బాజ్‌పాయ్ చేతుల మీదుగా కృష్ణప్రసాద్ అవార్డు అందుకున్నారు. వైద్యరంగంలో అత్యాధునిక పద్ధతులు అవలంభించినందుకు, బోధనలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినందుకు ఈ అవార్డు అందుకున్నారు. కృష్ణప్రసాద్‌ని శంకర్ ఫౌండేషన్ జీఎం రాధాకృష్ణన్, మేనేజింగ్ ట్రస్టీ కృష్ణకుమార్, సిబ్బంది అభినందించారు.

శాంతితోనే దేశాభివృద్ధి

సీతంపేట : దేశ అభివృద్ధి శాంతిపై ఆధారపడి ఉందని డీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్.దివాకర్ అన్నారు. బీవీ ఫౌండేషన్, ఐఏఆర్ఎఫ్ సంయుక్తంగా బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో క్రిస్మస్ సందర్భంగా మత సామరస్యంపై ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవం అంటే కృతజ్ఞతకు చిహ్నమని, ప్రతి క్రైస్తవుడు సమాజంలో మంచి మనస్సు కలిగి ఉండాలన్నారు. క్రీస్తు బోధనలు ఆచరిస్తే యుద్ధాలు నివారించగలమన్నారు. డాక్టర్ సత్యమూర్తి, డాక్టర్ ప్రజ్ఞాన్‌కుమార్, బ్రహ్మకుమారి రమా మాట్లాడుతూ యుద్ధాల నివారణకు అందరూ కృషి చేయాలని సూచించారు. నరవ ప్రకాశరావు, ఉషారాణి, జోగారావు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు


నిత్య కల్యాణంలో జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 108 స్వర్ణ సంపెంగ దళాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయ దాతలకు స్వామి వారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ త్రిమూర్తులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు


జాలరిపేటలో రాళ్లు తేలిన సీసీ రోడ్డు

పరవాడ: ముత్యాలమ్మపాలెం శివారు జాలరిపేటలో సీసీ రోడ్డు అధ్వానంగా మారింది. గ్రామానికి ఉన్న ఒకే ఒక రోడ్డు రాళ్లు తేలడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నామని కాలనీ వాసులు వాపోతున్నారు. పదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత లోపించడం వల్ల నిర్మించిన రెండేళ్లకే రాళ్లు తేలిపోయాయని, నాటి నుంచి మరమ్మతులు చేపట్టకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు తెలిపారు. గతంలో అధికారులకు విన్నవించినా ఫలితం కనిపించలేదన్నారు. కాలనీ వాసుల ఇబ్బందులను గుర్తించి సీసీ రోడ్డుకు అధికారులు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

భర్నికం ప్రజలకు శుద్ధి చేసిన నీరు సరఫరా


భర్నికంలో శుద్ధి చేసిన తాగునీరు పట్టుకుంటున్న మహిళలు

పరవాడ: మండలంలోని భర్నికం ప్రజలకు రెండు రోజుల నుంచి శుద్ధి చేసిన తాగునీటిని సరఫరా చేస్తున్నారు. గ్రామంలో డయేరియాతో బాధపడుతున్న వారిని దృష్టిలో పెట్టుకుని వైద్యుల సూచనల మేరకు శుద్ధి చేసిన తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఇటీవల గ్రామానికి చెందిన పలువురు డయేరియాతో అస్వస్థతకు గురవడంతో ఉన్నతాధికారులు గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించారు. డయేరియా తగ్గుముఖం పడుతుందనగా మళ్లీ శనివారం గ్రామంలో మరో నలుగురు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. వారికి పరవాడ పీహెచ్‌సీలో వైద్య సేవలు అందిస్తున్నారు. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. స్థానికంగా బోర్లు, మంచినీటి పథకాల ద్వారా సరఫరా చేస్తున్న నీటి వాడకాన్ని తాత్కాలికంగా నిలిపివేసి శుద్ధి చేసిన తాగునీటిని సరఫరా చేయాలని జిల్లా పంచాయతీ అధికారులు ఆదేశించారు. స్థానిక పంచాయతీ అధికారులు రెండు రోజుల నుంచి టాంకర్లతో శుద్ధి చేసిన నీరు సరఫరా చేస్తున్నారు. దీంతో గ్రామంలోకి నీటి ట్యాకరు రాగానే మహిళలు మంచినీరు కోసం బిందెలు పట్టుకుని పరుగులు తీస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పెందుర్తి: నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని పెందుర్తి టీడీపీ ఇన్‌చార్జి, రాష్ట్ర నూనె గింజల ఉత్పత్తిదారుల సహకార సంస్థ పర్సన్ ఇన్‌చార్జి గండి బాబ్జీ అన్నారు. మండలంలోని ఎస్ఆర్ పురంలో టీడీపీ సభ్యత్వ నమోదు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పార్టీ సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షల వరకు ప్రమాద బీమా సౌకర్యం ఉందన్నారు. కార్యక్రమంలో దూది రమణ, యర్ర రమణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

నష్టపోయిన వరి రైతులు


వంగలి గ్రామంలోని పొలంలో నుంచి ధాన్యం మూటలు మోస్తున్న రైతులు

సబ్బవరం: వాయుగుండం ప్రభావంతో మూడు రోజులుగా కురిసిన వర్షాలకు వరి సాగుచేస్తున్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. వరి పంట ఈ ఏడాది ఆశాజనకంగా ఉండటంతో కోతకు వచ్చిన సమయంలో అకాల వర్షాలు రైతులకు నష్టాలనే మిగులుస్తున్నాయి. మండలంలో సుమారు 3,300 ఎకరాల్లో వరి నాట్లు వేయడంతో కోతలు కోయాల్సి ఉండగా.. ప్రస్తుతం 2,375 ఎకరాల వరకూ కోతలు కోశారు. మరో 975 ఎకరాల వరకు కోతలు కోసుకోవల్సి ఉందని మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ తెలిపారు. ప్రస్తుతం 60 ఎకరాల వరకు కోసిన చేను పొలాల్లో ఉండటంతో భారీ వర్షాలకు వరి పనలు తడిసి పోయాయన్నారు. తడిసిన వరి పనలపై గింజ మొలకెత్తకుండా, గింజ నాణ్యత తగ్గకుండా ఉండేందుకు లీటర్ నీటికి/50 గ్రాముల ఉప్పు ద్రావణాన్ని పనలపై గింజలు తడిసే వరకు పిచకారీ చేయాలని సూచించారు. పొలాల్లో నీరు చేరిన వరి కుప్పల్లో 25 కిలోల గళ్లు ఉప్పు, 25 కిలోల ధాన్యం వాక వేసుకోవాలన్నారు.

ఆధ్యాత్మికత చాటిన సుశీలాజీ ప్రవచనాలు

విశాఖ విద్య: వేదాంత ఇన్‌స్టిట్యూట్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏయూలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ఐదు రోజుల పాటు భగవద్గీత 10వ అధ్యాయం 'విభూతియోగం'పై ఇంగ్లిష్‌లో నిర్వహించిన జ్ఞాన యజ్ఞం(ప్రవచనాల కార్యక్రమం) ఆదివారంతో ముగిసింది. ఆఖరి రోజు స్వామి పార్థసారథి శిష్యురాలు సుశీలాజీ ప్రవచనాలు వినేందుకు నగరవాసులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వీరి కోసం ఆడిటోరియంలో నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సుశీలాజీ ప్రవచిస్తూ మానవులు అతి ఆవశ్యకమైన ఆత్మచింతనను వదిలి అనవసరపు ప్రాపంచిక విషయాలపై తమ దృష్టిని నిలుపుతున్నారన్నారు. ఈ అధ్యాయంలో శ్రీకృష్ణుడు మానవుల ఆత్మ గురించిన పరిమితి ఆలోచనల నుంచి, సర్వవ్యాప్తి, సర్వధారి, సర్వశక్తి మంతమైనదని తెలియచెప్పడానికి ప్రయత్నించారని వివరించారు. సకల మానవాళి ఆత్మసాక్షాత్కారం లక్ష్యంగా అడుగులు వేయాలని సుశీలాజీ తన ప్రవచనాలను ముగించారు. ముందుగా భజన కీర్తనలు ఆలపించారు. స్వామీ పార్థసారథి వివిధ అంశాలపై రచించిన పుస్తకాలను ప్రదర్శించారు. జీవీపీ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ పి.సోమరాజు, వేదాంత ఇన్‌స్టిట్యూట్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

విస్తృతంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు


హైందవ శంఖారావం స్టిక్కర్లు ఆవిష్కరిస్తున్న మాతృమూర్తులు, ఫౌండేషన్ ప్రతినిధులు

పరవాడ: దేవాలయం కేంద్రంగా ప్రతీ గ్రామంలో ధార్మిక జట్టు ఆధ్వర్యంలో నెలలో ఒక పర్యాయం సత్సంగం, ప్రతీ పౌర్ణమికి సామూహిక హారతి, వారం వారం భజన కార్యక్రమాలు నిర్వహించాలని సమరసత సేవ ఫౌండేషన్ ప్రతినిధులు నిర్ణయించారు. పరవాడ సీతారాముల దేవాలయంలో ఆదివారం ఫౌండేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించే హైందవ శంఖారావం కోసం ప్రతి గ్రామం నుంచి వంద మంది పాల్గొనేలా సభ్యులు కృషి చేయాలన్నారు. అనంతరం హైందవ శంఖారావం కరపత్రాలు, స్టిక్కర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాతృమూర్తులు పాతల చిట్టెమ్మ, భద్రావతి, అమ్మాజీ, వానపల్లి సూరిబాబు, దేవరపల్లి ప్రసాద్, నక్కా బ్రహ్మాజీ, నర్సింగరాజు, దేముడు, లాలం రామారావు, రెడ్డి రామారావు, శెట్టి పైడిరాజు, జి.విశేష్ పాల్గొన్నారు.

వెంకటాద్రిపై విశేష పూజలు


పూజలందుకున్న వేంకటేశ్వర స్వామి


స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పెందుర్తి: వెంకటాద్రిపై జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఏడో రోజు ఆదివారం వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో వేకువజామున హారతి, సేవాకాలం, శాత్తుమొరై, తిరుప్పావై, పారాయణం, ప్రవచనం, తీర్థగోష్టి చేశారు. 7వ పాశురం వినిపించారు. అనంతరం ఈవో నీలిమ పర్యవేక్షణలో వందలాది మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆచార్య హరినాథ్

విశాఖ విద్య: మత్తు పదార్థాలకు బానిసైతే యువత జీవితం నాశనమవుతుందని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలల చీఫ్ వార్డెన్ ఆచార్య ఎస్.హరినాథ్ అన్నారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ఆదివారం శాతవాహన హాస్టల్ ప్రాంగణంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏయూను డ్రగ్స్ రహిత క్యాంపస్‌గా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఉన్నత ఆశయాలతో విశ్వవిద్యాలయంలో అడుగుపెట్టిన ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. ఆరోగ్యకరమైన అలవాట్లు కలిగి ఉంటూ, ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా నిరంతరం శ్రమించాలన్నారు. యువత ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రగ్స్‌కు బానిసలుగా మారకూడదని హితవు పలికారు. వాటి వల్ల ఆరోగ్యం, భవిష్యత్తు నాశనమవుతాయని గుర్తించాలన్నారు. విద్యావంతులైన యువత దేశానికి ఉపయుక్తంగా నిలిచే ఉన్నత మానవ వనరులుగా మారాలని చెప్పారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రత్యేకంగా తీర్చిదిద్దిన బ్యానర్‌లను ప్రదర్శిస్తూ విద్యార్థుల్లో అవగాహన కల్పించారు.

ఏయూ యోగా జట్టు ఎంపిక


పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ఆచార్య విజయమోహన్ తదితరులు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ పురుషులు, మహిళల యోగా జట్ల ఎంపిక ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఏయూ దూరవిద్యా కేంద్రం డైరెక్టర్, వ్యాయామ విద్యా విభాగం డైరెక్టర్ ఆచార్య ఎస్.విజయమోహన్ క్రీడాకారులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆల్ ఇండియా యూనివర్సిటీ యోగా పోటీలు భువనేశ్వర్‌లోని కిట్స్ యూనివర్సిటీలో ఈ నెల 24 నుంచి 28 వరకు జరుగుతాయన్నారు. వివిధ ఆసనాల్లో పోటీలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను విజయమోహన్, ఏయూ వ్యాయామ విద్యా విభాగం హెడ్ ఆచార్య ఎ.పల్లవి అభినందించి యోగాలో ప్రతిభ సాధించి వర్సిటీకి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. యోగా కోచ్ వర్మ తదితర క్రీడాకారులు పాల్గొన్నారు.

అనధికార పశు వధశాల నిర్వాహకుడి అరెస్ట్

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో అనధికారికంగా పశు వధశాల నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని ఆరిలోవ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ముస్తఫా కాలనీలో పశు మాంస వ్యాపారి ఇబ్రహీం అనధికారికంగా పశు వధశాల నిర్వహిస్తున్నాడు. అందులో ఆదివారం దూడలను వధిస్తుండగా.. స్థానికులు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు స్పందించి వెంటనే వ్యాపారి నిర్వహించే పశు వధశాలకు చేరుకున్నారు. అక్కడ దూడను ఏట వేసిన సమయంలో ఇబ్రహీంను అదుపులోకి తీసుకున్నారు. నిబంధనలు మీరి అనధికారికంగా వధ శాల నిర్వహించి ఏటలు వేయడంతో ఇబ్రహీంను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.